క్లుప్తంగా

బయ్యనగూడెం యువకుడికి అవార్డు



అవార్డును అందుకుంటున్న జంగాల రమేష్

కొయ్యలగూడెం: షార్ట్ ఫిలిం విభాగంలో అవార్డును అందుకున్నట్లు బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన రమేష్ జంగాల బుధవారం పేర్కొన్నారు. వైజాగ్‌లో నిర్వహించిన నేషనల్ లెవెల్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ కార్యక్రమంలో తాను దర్శకత్వం వహించిన ×టార్చ్‌లైట్ అనే షార్ట్ ఫిలింకు జాతీయ పురస్కారం లభించిందన్నారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల ఇతివృత్తంగా షార్ట్ ఫిలిం రూపొందించానన్నారు. ఈ సందర్భంగా జంగాల రమేష్‌ను పలువురు అభినందించారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

లింగపాలెం: రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలని శాస్త్రవేత్త ఎన్.నాగేంద్రబాబు అన్నారు. మండలంలోని యడవల్లిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆచార్య ఎన్‌జీ రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం ఏలూరు శాస్త్రవేత్త ఎస్.నాగేంద్రబాబు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. రైతులకు సార్వా, దాళ్వా కాలాల్లో సాగు చేసిన, చేయాల్సిన వరి రకాలు, వరి పంటలో పురుగులు, తెగుళ్లు, యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు డి.దుర్గారావు, వీఆర్వో ఎస్.ప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక చట్టానికి ఉద్యమ ప్రణాళికలు



సింగన్నపల్లిలో సమావేశమైన జేఏసీ నాయకులు

బుట్టాయగూడెం: మండలంలోని సింగన్నపల్లి కమ్యూనిటీ హాల్ వద్ద బుధవారం ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆదివాసీ నిరుద్యోగులు షెడ్యూల్ ప్రాంత ఉద్యోగుల నియామక చట్టం కోసం ఉద్యమం చేపట్టడానికి కార్యాచరణ రూపొందించినట్లు ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ మొడియం శ్రీనివాసరావు తెలిపారు. ఈ నెల 30వ తేదీన కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు, ఏటీఏ గౌరవ సలహాదారు తెల్లం రాములు, నాయకులు రవ్వా బసవరాజు, పొడియం కొవ్వాడయ్య, తెల్లం రవిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



వివరాలను వెల్లడిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి

చింతలపూడి: జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి.మధుబాబు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక కోర్టు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్‌అదాలత్‌లను వినియోగించుకోవాలని సూచించారు. డిసెంబర్ 14 న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, బ్యాంక్ రికవరీ కేసులు, చెక్ బౌన్స్ కేసులు, బీఎస్ఎన్ఎల్ రికవరీ కేసులు, కుటుంబ తగాదా కేసులు, మనోవర్తి కేసులు, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని తెలిపారు. కోర్టుల్లో కేసుల సంఖ్య తగ్గించడానికి పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమాచారం కోసం దగ్గరలోని పోలీస్ స్టేషన్లను, కోర్టు సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు డిసెంబర్ 14 శనివారం జంగారెడ్డిగూడెం కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జంగారెడ్డిగూడెం మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) సీహెచ్ కిషోర్‌కుమార్ పోలీసులతో నిర్వహించిన సమావేశంలో తెలిపారు.

పాడిరైతుల ఇంట.. పసిడి పంట

- మేలు జాతి పశువులతో అధిక పాల దిగుబడి
- కృత్రిమ గర్భధారణతో పాడి అభివృద్ధి
- పశు పోషణలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలంటున్న అధికారులు



కృత్రిమ గర్భంతో జన్మించిన గేదె దూడ



కృత్రిమ గర్భంతో జన్మించిన ఆవుదూడ

బుట్టాయగూడెం: పాడి పంటలు వ్యవసాయ కుటుంబాలకు రెండు కళ్ల వంటివి. ప్రకృతి వైపరీత్యాలు, ధరల పతనం, మార్కెట్ మోసాలతో అప్పుడప్పుడు రైతులు వ్యవసాయంలో నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో పాడి పశువులు రైతులను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. పంటల సాగుకు ఏడాది పొడవునా పెట్టుబడి పెట్టాలి. ఒకవేళ ప్రకృతి అనుకూలించకపోతే పెట్టిన పెట్టుబడి అంతా కోల్పోవాలి. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు పాడిపశువులు ఆసరాగా నిలుస్తున్నాయి. వీటి పోషణ, మేలు జాతి పశువుల ఎంపికలో తగు జాగ్రత్తలు తీసుకుంటే పాడి రైతుల ఇంట పసిడి పంట పండుతుందని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. గ్రామాల్లో నిరుద్యోగులు, కూలీలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. పోలవరం నియోజకవర్గంలోని 7 మండలాల పరిధిలో 40 శాతం మందికి పైగా పాడి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకల పెంపకంపై జీవనం సాగిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో సుమారు 6775 ఆవులు, గేదెలు ఉండగా సెపెంబర్ నాటికి 2022 లేగ దూడలు జన్మించినట్లు అధికారులు చెప్తున్నారు. వీటి ద్వారా వస్తున్న పాలతో పాడి రైతులకు రోజుకు రూ.3.85 లక్షల వరకూ ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇంకా మరింత అభివృద్ధి చెందాలంటే మెరుగైన యాజమాన్య పద్ధతులను పాటించాలని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ఉత్తమ జాతి పశువులు మేలు

పాడి పరిశ్రమలో అధిక లాభాలు పొందాలంటే ఉత్తమ జాతులను ఎంచుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు. అధిక పాలనిచ్చే మేలు జాతి ముర్రా గేదె, సంకర జాతి ఆవులను పోషించాలి. రోజుకు 12 లీటర్లకు తక్కువ కాకుండా పాలను ఇచ్చే ఆవులు, గేదెలై ఉండాలి. వాటికి సమతుల ఆహారం తప్పనిసరిగా అందించాలి. నీరు, నీడ, ఆరోగ్యకరమైన వాతావరణం పశువులకు కలిగించాలి.

మేలు జాతి పశువులను ఎంపిక చేసుకోవాలి

మేలు జాతి పశువులను ఎంపిక చేసుకోవాలి. పాడిపశువులు ఎక్కువకాలం పాలనిచ్చేలా చూసుకోవాలి. ఈనిన 60 నుంచి 90 రోజుల మధ్య కాలం ఎదకు వచ్చేలా చూసుకోవాలి. మొదటిసారి ఎదకు వచ్చినప్పుడే చూడు కట్టించేలా జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యమైన మేలు జారి పశువీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయించాలి. అప్పుడే సంకరజాతి పశువుల ఉత్పత్తితో పాడి పరిశ్రమ వృద్ధి చెంది అధిక పాల దిగుబడి సాధించే అవకాశం ఉంటుంది. సంకరజాతి పశువులు 18 మాసాలకే ఎదకు వస్తాయి. దేశవాళీ గేదెలు, ఆవులు ఈత అనంతరం 200 రోజుల పాటు పాలనిస్తాయి. సంకరజాతి ఆవులు ఈనిన తర్వాత 350 రోజులు పాలు ఇస్తాయని పశు సంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

వైద్యుల సూచన పాటించాలి



పాడి రైతులు పశు వైద్యుల సలహాలు, సూచనలను తప్పనిసరిగా పాటించాలి. మూగ జీవాలకు ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే స్థానిక పశు వైద్యులను సంప్రదించాలి. పాడి అభివృద్ధికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని రైతులు అభివృద్ధి చెందాలి. అలాగే పశువులకు కూడా బీమా చేయించుకుంటే భరోసా ఉంటుంది.

–డాక్టర్ మల్లంపల్లి సాయిబుచ్చారావు
సహాయ సంచాలకులు, జీలుగుమిల్లి

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న స్వాములు

కొయ్యలగూడెం: మండల దీక్ష పూజోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కన్నాపురం రోడ్డులోని టెంపుల్స్ సెంటర్‌లో అయ్యప్పస్వామి మందిరంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. దిప్పకాయలపాడు గ్రామానికి చెందిన జి.సత్యనారాయణ సౌజన్యంతో 180 మందికి పైగా అయ్యప్ప స్వాములకు అన్న సమారాధన నిర్వహించారు. మందిరంలోని స్వామివారికి ఈ సందర్భంగా అర్చకులు గుడిపూడి శేషాచార్యుల ఆధ్వర్యంలో పడునెట్టాంబడి పూజలు నిర్వహించారు.

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

జంగారెడ్డిగూడెం: స్థానిక ఏరియా హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాల్సిన పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ జంగారెడ్డిగూడెం ఏరియా హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికులు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నాలుగో రోజు నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమానికి ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు సంఘీభావం ప్రకటించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు మాట్లాడుతూ ఏరియా హాస్పిటల్‌లో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు ఐదు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ద్వారకా తిరుమల మండల సీపీఐ కార్యదర్శి గొలిమే బాలఏసు, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల సంఘం కార్యదర్శి బొక్కా శ్రీను, హాస్పిటల్ పారిశుద్ధ్య కార్మికుల సూపర్‌వైజర్లు వేముల రాజు, బూరుగు సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం: ఏరియా ఆసుపత్రి వద్ద నిరసన తెలుపుతున్న పారిశుద్ధ్య కార్మికులు



చింతలపూడి: ఆందోళన చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

చింతలపూడి: ప్రభుత్వ ఆస్పత్రిలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల నిరసన నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారికి రావలసిన ఐదు నెలల పెండింగ్ జీతాలు, పెండింగ్ పీఎఫ్, ఈఎస్ఐలను విడుదల చేయాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దుచేసి పర్మినెంట్ చేయాలని నిరసన తెలిపి నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. నిరసన కార్యక్రమానికి రైతు సంఘం మండల అధ్యక్షులు ఎస్.కె కాలేశా మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి తోర్లపాటి బాబు, ది మెడికల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఏఐటీయూసీ అనుబంధం చింతలపూడి శాఖ అధ్యక్షురాలు తుర్లపాటి మరియమ్మ, తిరుమల శెట్టి రాము, కూరపాటి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే గ్రామసభల్లో అర్జీల వెల్లువ



కొయ్యలగూడెం: దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



లింగపాలెం: గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ నజీం షా

కొయ్యలగూడెం: భూ సర్వే ప్రక్రియ పూర్తి కావడంతో రైతులు తమ అభియోగాలను గ్రామసభల్లో లిఖిత పూర్వకంగా దరఖాస్తులు అందజేసి వారి సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కె.చెల్లన్న దొర పేర్కొన్నారు. పరింపూడి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పరింపూడి పరిధిలో 12, అచ్యుతాపురం 19, బోడిగూడెం 16, కలిపి మొత్తం 47 ఫిర్యాదులు రైతులు సరిహద్దు సమస్యలు, భూ తగాదాల గురించి భూ సమస్యలపై దరఖాస్తులు అందజేశారని ఆర్ఐ మణి దివ్య తెలిపారు. గురువారం దిప్పకాయలపాడు పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసభ నిర్వహించనున్నారు. సర్పంచులు ముప్పిడి విజయ కుమారి, మద్దిపాటి నాగమణి, కడకట్ల గడ్డియ్య, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం: మండలంలోని మఠంగూడెంలో బుధవారం భూ రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. తహసీల్దార్ మహమ్మద్ నజీముల్లా అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. గ్రామ సభలో పలువురు రైతులు తమ అభ్యంతరాలు వెల్లడించినట్లు తహసీల్దార్ తెలిపారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో 11 అర్జీలు వచ్చినట్లు చెప్పారు. రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నాగబాబు, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఐటీడీఏ వద్ద నిర్వాసితుల ధర్నా



కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ఆందోళన చేస్తున్న ఆదివాసీ సంఘ నాయకులు

బుట్టాయగూడెం: పోలవరం ముంపు ప్రాంతాల నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆదివాసీ భారత మహాసభ ఆధ్వర్యంలో బుధవారం కేఆర్‌పురం ఐటీడీఏ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ రెడ్‌స్టార్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి జొన్నకుటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆదివాసీ భారత మహాసభ ఇటీవల నిర్వాసిత గ్రామాల్లో పర్యటించి అక్కడి సమస్యలను గుర్తించామన్నారు. సమస్యలకు సంబంధించి ఒక నివేదికను కూడా రూపొందించామన్నారు. నిర్వాసిత గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఒక వినతి పత్రాన్ని ఏపీవో పీవీఎస్ నాయుడుకి అందజేశారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డి.రంగనాథం, ఆదివాసీ భారత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మంద్రు రామిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మడకం రామన్న, ఏఐకేఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మహమ్మద్ బాషా, నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కలింపూడి సుందరరావు, నాయకులు రామ్‌గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, మహమ్మద్ సలీమా, తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు

చింతలపూడి: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగం వలన వ్యక్తి గతంగానే కాకుండ కుటుంబాలపై, సమాజంపై కలిగే దుష్ప్రభావాలను గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌జెకె నరేంద్ర కుమార్,ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డా ఏవీఆర్, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డా సయ్యద్ మీర్‌ఆసీమ్, అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

వేలేరుపాడు: పెద్దవాగు ప్రాజెక్టు వరద వలన సర్వస్వం కోల్పోయిన వరద బాధితులను ఆదుకోవాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా వేలేరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో అల్లూరినగర్‌లో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు 300 మందితో రాస్తారోకో చేపట్టారు. దీంతో రాకపోకలు స్తంభించిపోయాయి. అల్లూరినగర్ నుంచి మేడేపల్లి వరకు ఆర్టీసీ బస్సులు, ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు నిలిచిపోయాయి. వేలేరుపాడు తహసీల్దార్ డివిజన్, జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి ఈ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాల రావు, వేలేరుపాడు మండల కార్యదర్శి సోయం చంద్రరావు, డివిజన్ నాయకులు కట్టం వీరాస్వామి, మేడేపల్లి సర్పంచ్ కట్టం రాంబాబు, మేడిపల్లి ఎంపీటీసీ తుర్రం తమ్మయ్య, కారం భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అల్లాడను చేర్చుకోవద్దంటూ ఘర్షణ

ద్వారకాతిరుమల: వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీటీసీగా గెలుపొంది టీడీపీలోకి జంప్ అవ్వాలనుకున్న నాయకుడికి చేదు అనుభవం ఎదురైంది. ఓ వర్గం టీడీపీ నేతలు ఆ ఎంపీటీసీని చేర్చుకోవడానికి వీల్లేదని అడ్డుపడగా మరో వర్గం చేర్చుకోవాలని పట్టుబట్టారు. వీరి మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని దొరసానిపాడుకు చెందిన అల్లాడ హరేరామకృష్ణ 2021లో వైఎస్సార్ సీపీ తరఫున ఎంపీటీసీగా గెలుపొందారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీలో చేరాలని నిర్ణయించుకున్నారు. గతనెల 25న గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును కలిసి పూల బొకే అందించారు. ఇదిలా ఉండగా బుధవారం దొరసానిపాడు వచ్చిన ఎమ్మెల్యే వెంకటరాజు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకునేందుకు అల్లాడ అంతా సిద్ధం చేసుకోగా గ్రామ టీడీపీ అధ్యక్షుడు మద్దిపాటి రత్నాజీ వర్గీయులు వీల్లేదని ఖరాకండీగా చెప్పారు. మరోవర్గం నేత కారుమంచి మురళీ వర్గీయులు అల్లాడను పార్టీలో చేర్చుకోవాల్సిందేనని పట్టుబట్టారు. రెండు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో ఎమ్మెల్యే వెంకట్రాజు ఎంపీటీసీ అల్లాడను పార్టీలో చేర్చుకోకుండానే వెళ్లిపోయారు. ఘర్షణ దృశ్యాలను కొందరు సెల్‌ఫోన్లలో చిత్రీకరించగా, వాటిని తెలుగు తమ్ముళ్లు బలవంతంగా డిలీట్ చేయించారు.

బాలలను పనిలో పెట్టుకుంటే లైసెన్స్‌లు రద్దు

ఏలూరు (టూటౌన్): బాలలను పనిలో పెట్టుకుంటే సంబంధిత దుకాణాలు, హోటల్స్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్ట ప్రకారం శిక్షిస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ హెచ్చరించారు. రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నాగేశ్వరరావు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.సూర్య చక్రవేణి, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ ఏలూరులోని హోటల్, మాల్స్ యజమానులకు, ఉద్యోగులకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 18 సంవత్సరాల్లోపు బాలలను పనిలో చేర్చుకొంటే దుకాణాల లైసెన్సు రద్దు చేయడమే కాక చట్టపకారం శిక్షిస్తామన్నారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098 లేదా 15100కు సమాచారం అందించాలని కోరారు. డిసెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఈ-చలానాలు రద్దు కోరుతూ మంత్రికి వినతి

ఏలూరు (టూటౌన్): ఆటోలు, టాక్సీలపై ఈ-చలానాలను రద్దు చేయాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విజయవాడలోని ఆయన క్యాంప్ ఆఫీసులో బుధవారం ఉదయం సీఐటీయూ నాయకులు చక్రాల అమర్ కుమార్, జె.గోపి, బి.చంద్రశేఖర్ వినతి పత్రం అందజేశారు. ఏలూరు నగరంలో స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో విధిస్తున్న ఈ-చలానాలను రద్దు చేయాలని స్టాప్ లైన్, జీబ్రాలైన్, సీసీ కెమెరాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఆటోలు, టాక్సీలపై రూ.300 నుంచి రూ.30 వేల వరకు విధించడం వల్ల డ్రైవర్లు తీవ్ర ఆందోళన గురవుతున్నారని తెలిపారు. నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ శివాజీ, ముజఫర్ అహ్మద్ కోరారు.

చదరంగంలో ద్వారకాతిరుమల విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: మండలంలోని ద్వారకానగర్‌లోని డిపాల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చదువుతున్న భీమడోలుకు చెందిన విద్యార్థి కె.త్రిషాంక్ కోటి జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో ప్రతిభను కనబరిచాడు. గత రెండు రోజులుగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని భారతీయ విద్యా భవన్స్ పాఠశాలలో జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహిస్తున్నారు. అందులో నిర్వహించిన అండర్-17 బాలుర చదరంగం పోటీల్లో త్రిషాంక్ కోటి విజయం సాధించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ నెల్సన్ జాన్ వీసీ, త్రిషాంక్ కోటికి పూల బొకేను అందించి అభినందించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, గ్రామస్తులు విద్యార్థి ప్రతిభను కొనియాడారు. అలాగే విద్యార్థికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు.

సారా విక్రయిస్తే కఠిన చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఐ అశోక్

చింతలపూడి: నాటు సారా తయారీ, విక్రయాలు నిర్వహిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ హెచ్చరించారు. చింతలపూడి మండలం, నాగిరెడ్డిగూడెం గ్రామంలో బుధవారం జిల్లా అధికారుల ఆదేశాల మేరకు నాటు సారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ అశోక్ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో సారా తయారీ కేంద్రాలను గుర్తించి గ్రామాలపై మహిళా పోలీస్ ఎక్సైజ్ సిబ్బందితో గట్టి నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఎస్‌టీఎఫ్ ఏలూరు ఎస్సై ఆరిఫ్, స్థానిక ఎక్సైజ్ ఎస్సైలు అబ్దుల్ ఖలీల్, ఆర్‌వీఎల్ నరసింహారావు, జె.జగ్గారావు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

చింతలపూడి: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు బుధవారం నాగిరెడ్డిగూడెం గ్రామంలో దాడులు నిర్వహించారు. దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అదే విధంగా మండలంలోని శెట్టివారిగూడెం గ్రామంలో నక్కా లక్ష్మి అనే మహిళను అరెస్ట్ చేసి 10 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని మహిళకు సారా సరఫరా చేసిన నామవరం గ్రామానికి చెందిన భూతి శ్రీనుపై పరారీ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో స్థానిక ఎస్సైలతో పాటు ఏలూరు ఈఎస్‌టీఎఫ్ ఎస్సై పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు డీఎస్సీ ఉచిత శిక్షణ

జంగారెడ్డిగూడెం: మండలంలోని అప్‌లాండ్ ఏరియా, హెడ్ క్వార్టర్‌లో డీఎస్సీ శిక్షణ తరగతులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్‌ను, సాంఘిక సంక్షేమ శాఖ జేడీని మాల మహానాడు రాష్ట్ర లీగల్ కార్యదర్శి తొర్లపాటి శ్రీనివాసరావు కోరారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టెట్‌లో అర్హత సాధించి డీఎస్సీ కోచింగ్‌కు వెళ్లలేని నిరుపేద విద్యార్థులకు గొప్ప అవకాశం అందించే విధంగా కలెక్టర్ చొరవ చూపాలన్నారు. జంగారెడ్డిగూడెంలో డీఎస్సీ శిక్షణ తరగతులు ప్రారంభిస్తే పేద విద్యార్థులు గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో ముందుకు వెళతారని ఈ విషయంపై జిల్లా కలెక్టర్ స్పందించి డీఎస్సీ కోచింగ్ సెంటర్‌ను జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేయాలని మాల మహానాడు, దళిత గిరిజన సంఘాల తరఫున కోరుతున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

కొట్లాట కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తిని కొట్టి గాయపర్చిన నేరంపై నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన వల్లపు రాంబాబు, అతని ఆఖరి తమ్ముడు కుమార్ ఒక ఇంటిలో చెరో పోర్షన్‌లో నివాసం ఉంటున్నారు. రాంబాబు మరదలు పల్లపు నాగేశ్వరి, దారికి అడ్డంగా బట్టలు ఆరబెట్టడంతో, రాంబాబు కుల బంట్రోతుతో బట్టలు తీయమని నాగేశ్వరికి చెప్పించాడు. దీంతో నాగేశ్వరి, రాంబాబు భార్యతో గొడవ పడింది. ఈ క్రమంలో రాంబాబు తమ్ముడు కుమార్ గొడవలకు కారణం నువ్వే అంటూ రాంబాబుపై దాడి చేశాడు. ఈ దాడిలో రాంబాబు కుడి భుజం గూడ జారిపోవడంతో స్థానికులు రాంబాబును ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, రాంబాబు ఫిర్యాదు మేరకు కుమార్, అతని భార్య నాగేశ్వరి, గొడవకు సహకరించిన రాంబాబు మరో తమ్ముడు, అతని భార్యలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.